క్లుప్తంగా

మట్టి గణపతి ప్రతిమల పంపిణీ



మట్టి ప్రతిమలు అందిస్తున్న కార్పొరేటర్ సుధ, సీఐ విద్యాసాగర్

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డులోని శ్రీ శ్రీనివాస మెడికల్ స్టోర్ వద్ద గురువారం స్థానికులకు మట్టి గణపతి విగ్రహాలను మల్కాపురం సీఐ విద్యాసాగర్, కార్పొరేటర్ కొణతాల జగన్మోహన సుధ దంపతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయక చవితి పండగను పర్యావరణ హితంగా జరుపుకోవాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టితో చేసిన ప్రతిమలను పూజించాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార మాసోత్సవాలు



పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు త్రినాథపురం అంగన్‌వాడీ-1, 2 కేంద్రాల్లో టీచర్లు బల్ల భారతి, యశోదల ఆధ్వర్యంలో, అంబేడ్కర్ కాలనీ, ఏకేసీ కాలనీ 1, 2, గుడివాడ అప్పన్న కాలనీల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం పౌష్టికాహార మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ ఎస్.వరలక్ష్మి మాట్లాడుతూ గుడ్లు, పాలు, రాగిపిండి తదితర పోషకాహార పదార్థాలు తల్లులు, గర్భిణుల రోజూ వారి ఆహారంలో భాగంగా ఉండేలా చూసుకోవాలన్నారు. వర్షా కాలంలో డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సృజన సంస్థ శ్రీ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ జ్యోతి, అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు, ఆశా కార్యకర్తలు, స్థానిక డ్వాక్రా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు



సింహాచలం రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారాలపై నిర్మిస్తున్న షెడ్లు

గోపాలపట్నం: సింహాచలం రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. బయట నూతన రైల్వే స్టేషన్ నిర్మాణ పనులు వేగవంతం చేస్తున్నారు. ప్లాట్‌ఫాంపై నూతనంగా షెడ్లు వేస్తున్నారు. గతంలో కొంత మేరకే ఈ షెడ్లు ఉండేవి. 1, 2 నంబర్ల ప్లాట్‌ఫారాలపై కొత్తగా షెడ్లు నిర్మిస్తున్నారు. వీటి వల్ల ఎండా, వానల సమయంలో తాము పడుతున్న ఇబ్బందులు తొలగుతాయని ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఈ పనులు చూసిన వారు సింహాచలం రైల్వే స్టేషన్ రూపురేఖలు మారుతున్నాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పెంపుడు కుక్క జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలు



పేదలకు దుప్పట్లు అందిస్తున్న ఏఎస్ఐ గోవిందమ్మ

గోపాలపట్నం: గోపాలపట్నంలో నివాసముంటున్న క్రైం ఏఎస్ఐ గోవిందమ్మ తన పెంపుడు కుక్క స్నోయి మృతి చెంది ఏడాది పూర్తి అయిన సందర్భంగా గురువారం సంవత్సరీకం చేశారు. ఈ సందర్భంగా నగరంలో పలుచోట్ల సేవా కార్యక్రమాలు చేపట్టారు. పేదలకు చీరలు, దుప్పట్లు పంచిపెట్టారు. భోజనం ప్యాకెట్లు అందించారు.

గురుదేవోభవ

- విద్యాలయాల్లో వేడుకగా ఉపాధ్యాయ దినోత్సవం
- సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు ఘన నివాళి

గోపాలపట్నం: దేశ తొలి ఉపరాష్ట్రపతి, ఉపాధ్యాయ వృత్తికి వన్నెతెచ్చిన సర్వపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా గురువారం విద్యాలయాల్లో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. నరవ బెహరా విద్యా సంస్థల్లో రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బెహరా విద్యా సంస్థల సెక్రటరీ బెహరా విజయచైతన్య మాట్లాడుతూ ఉపాధ్యాయులను గౌరవించిన వారు ఉన్నతంగా ఎదుగుతారన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం ఉపాధ్యాయులకు, నేటి తరం విద్యార్థులకు ఆదర్శమన్నారు. అనంతరం జరిగిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ పట్నాయక్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సుకన్య, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ హిందుమతి, వరలక్ష్మి, ఇంటర్ కాలేజీ ప్రిన్సిపాల్ జగదీష్, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ సాంబమూర్తి, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు ఘన నివాళి

విశాఖ విద్య: దేశ తొలి ఉపరాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఆధ్వర్యంలో 52వ వార్డు శాంతినగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు ఘన నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పార్టీ కార్యకర్తలు, యువకులతో కలిసి శ్రీధర్ పూలమాలలు వేసి మాట్లాడారు. దేశ చరిత్రలో ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం ఆనందదాయకమన్నారు. ఆయన చూపిన బాటలో ఉపాధ్యాయులంతా నడిచి తమ వృత్తికి పేరు తెచ్చేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో 52వ వార్డు యువజన అధ్యక్షుడు జియ్యాని విజయకుమార్, శాంతినగర్ యూత్ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- ఎన్ఏడీ కొత్త రోడ్డులోని రామకృష్ణ పాఠశాలలో హెచ్ఎం ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులు విద్యా సంస్థల అధినేత ఎ.కృష్ణారెడ్డి, పాఠశాల ప్రధానాచార్యుడు జి.వి.రవీంద్రుడు సర్వేపల్లి చిత్రపటానికి పుష్పమాలాంకరణ చేశారు. కృష్ణారెడ్డి మాట్లాడుతూ నేటి విద్యార్థులు భావితరాలకు మార్గదర్శిగా నిలవాలని ఆకాంక్షించారు. ప్రధానాచార్యుడు మాట్లాడుతూ ఆదిగురువు దక్షిణామూర్తి నుంచి మంచి లక్షణాలను అలవరచుకోవాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాల బాలబాలికలు ఒక్కరోజు ఉపాధ్యాయులుగా కొనసాగారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సర్వేపల్లి చిత్రపటం వద్ద ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు.

పాఠశాలల్లో విద్యార్థుల సందడి

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులు ఉపాధ్యాయులకు పాదాభివందనం చేసి ఆశీర్వచనలను తీసుకున్నారు. 60వ వార్డు శ్రీహరిపురం భాష్యం పాఠశాలలో విద్యార్థుల చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఉపాధ్యాయులను విద్యార్థులు సత్కరించారు. 58వ వార్డు పిలకవానిపాలెంలోని లక్కీ అమర్ స్కూల్‌లో టీచర్స్ డే వేడుకలు సందడిగా జరిగాయి.



బెహరా విద్యా సంస్థలో రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విజయచైతన్య తదితరులు



52వ వార్డులో రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్



రామకృష్ణ స్కూల్‌లో సర్వేపల్లి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



భాష్యం స్కూల్ ఉపాధ్యాయుల సందడి



గురు పూజోత్సవంలో పాల్గొన్న లక్కీ అమర్ స్కూల్ ఉపాధ్యాయులు

ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు



కలెక్టర్ హరేందిర ప్రసాద్ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న దయానందరావు



కన్నబాబును సత్కరిస్తున్న అధికారులు



సత్యవతిని సత్కరిస్తున్న అధికారులు

గోపాలపట్నం/మల్కాపురం: విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తున్న పలువురు ఉపాధ్యాయులను డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఘనంగా సత్కరించి, పురస్కారాలు అందజేశారు. గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు వై.దయానందరావు జిల్లా స్థాయి ఉత్తమ తెలుగు ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. 59వ వార్డు ఎక్స్‌సర్వీస్‌మెన్ కాలనీ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు వి.కన్నబాబు, మల్కాపురం ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయిని ఎస్.సత్యవతి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం నగరంలో జరిగిన గురుపూజోత్సవంలో కలెక్టర్ హరేందిర ప్రసాద్, అధికారులు, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా వీరు పురస్కారాలు అందుకున్నారు. ఉపాధ్యాయ పండిత పరిషత్ జిల్లా అధ్యక్షుడిగా దయానందరావు సేవలందిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనను గోపాలపట్నం హైస్కూల్ హెచ్ఎం వేణుగోపాలరావు, తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

హెల్మెట్ లేకుంటే లైసెన్స్ రద్దు



లైసెన్సు రద్దు సిఫార్సు చేస్తున్న సీఐ దాశరథి

విశాఖ విద్య : రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా రహదారి నిబంధనలు పాటించని వాహన చోదకులపై ట్రాఫిక్ పోలీసులు ఫోకస్ పెట్టారు. ఈ నేపథ్యంలో సీఐ ఎ. దాశరథి ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ఎన్ఏడీ ఫ్లైఓవర్ కింద విస్తృత తనిఖీలు నిర్వహించారు. అక్కడ గల నాలుగు దారుల్లో ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేసి, ధ్రువపత్రాలు పరిశీలించారు. ప్రధానంగా హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనాలపై వచ్చే వారిపై దృష్టి సారించారు. ఈ సందర్భంగా వాహనదారులకు సీఐ దాశరథి పలు సూచనలు చేశారు. హెల్మెంట్ లేకుండా వాహనాలు నడిపే వారి లైసెన్సును మూడు నెలల పాటు సస్పెన్షన్‌లో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. లైసెన్సు పునరుద్ధరణ జరిగేంత వరకు వారు వాహనాలు నడపడానికి వీల్లేదన్నారు. లైసెన్సు రద్దు చేయబడిన వ్యక్తులు మళ్లీ వాహనాలు నడిపినట్లైతే, వారికి జరిమానా వేస్తామన్నారు. ద్విచక్రవాహనం నడిపే వారితో పాటు, వెనుక కూర్చునే వ్యక్తులు కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్లలో వచ్చే వారు తప్పనిసరిగా సీటు బెల్టు ధరించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ఇటువంటి చర్యలు తీసుకుంటన్నామని, ఈ విషయంలో వాహన చోదకులు సహకరించాలన్నారు. ప్రతి రోజూ ఇదే మాదిరి తనిఖీలు ఉంటాయన్నారు.

సింహాచలం రైల్వే స్టేషన్‌లో తనిఖీలు



రైల్వే స్టేషన్‌లో సీఐ సురేష్, ఆర్పీఎఫ్ ఎస్ఐ మమత, జీఆర్పీ ఎస్ఐ రవివర్మ, సిబ్బంది

గోపాలపట్నం: సింహాచలం రైల్వే స్టేషన్‌లో గురువారం గోపాలపట్నం సీఐ సురేష్, ఆర్పీఎఫ్ ఎస్ఐ మమత, జీఆర్పీ ఎస్ఐ వి.రవివర్మ, పోలీసులు తనిఖీలు నిర్వహించారు. రైల్వే స్టేషన్ పరిసరాలను ప్రత్యేకంగా పరిశీలించారు. ఇక్కడ అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి తరలింపు వంటివి జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ముందస్తు రక్షణ చర్యలు ఏవిధంగా చేపట్టాలన్న అంశాలపై ఆర్పీఎఫ్, జీఆర్పీ అధికారుల నుంచి వివరాలు సేకరించారు. స్టేషన్‌కు ప్రయాణికులు వచ్చి వెళ్లే మార్గాలు, పరిసరాలు ఏవిధంగా ఉన్నాయో వీరు సంయుక్తంగా పరిశీలించారు. ప్లాట్‌ఫారాలపై పరిస్థితులను సీఐ సురేష్‌కు ఆర్పీఎఫ్ ఎస్ఐ మమత వివరించారు. ప్రయాణికులు ప్లాట్‌ఫారం నుంచి వెళ్లేందుకు మరో మార్గం లేదని, ఫుట్‌ఓవర్ బ్రిడ్జిపై వెళ్తారని తెలిపారు. ఈ సందర్భంగా సీఐ సురేష్ మాట్లాడుతూ గంజాయి వంటి మాదక ద్రవ్యాలను నిరోధించేందుకు, నేరాలు జరగకుండా తాము సంయుక్తంగా తనిఖీలు చేశామని చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో ముందస్తు చర్యల్లో భాగంగా స్టేషన్‌లో సెక్యూరిటీ చెకింగ్ చేశామన్నారు. కార్యక్రమంలో మూడు విభాగాల పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పూజలకు సిద్ధమవుతున్న గణనాథులు

పారిశ్రామిక ప్రాంతం గణపతి పూజలకు సిద్ధమవుతోంది. ఎక్కడ చూసినా యువత బొజ్జ గణపయ్య పూజలకు అన్నీ సిద్ధం చేస్తూ హడావుడిగా కనిపిస్తున్నారు. వెరైటీ డిజైన్లలో గణేశ విగ్రహాల ఎంపిక, అందమైన పందిళ్ల రూపకల్పన, కళ్లు మిరుమిట్లు గొలిపే విద్యుద్దీపాల ఏర్పాటులో తలమునకలై ఉన్నారు. దీంతో ఎక్కడ చూసినా సందడి వాతావరణమే నెలకొంది.



వినాయక ప్రతిమను తయారు చేస్తున్న కళాకారుడు



శివలింగం చెంతన గణనాథుడు



పీఠంపై ఠీవిగా కూర్చున్న గణనాథుడు

- పారిశ్రామిక ప్రాంతానికి వినాయక చవితి శోభ
- వివిధ రూపాల్లో ఆకట్టుకుంటున్న గణనాథులు

మల్కాపురం : వినాయక చవితి సమీపించిన తరుణంలో పారిశ్రామిక ప్రాంతంలోని పలు వార్డుల్లో గణనాథుని మండపాలను ఆయా ప్రాంతాల యువత ఏర్పాటు చేస్తున్నారు. తమ మండపాల్లో వినాయకులను అందరి కంటే భిన్నంగా పెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దీని కోసం దగ్గరలో వినాయక ప్రతిమలు తయారు చేసే కళాకారుల వద్దకు వెళ్లి నచ్చిన డిజైన్‌లో స్వామి విగ్రహం రూపుదిద్దేందుకు ప్రయత్నిస్తున్నారు. 61వ వార్డు మల్కాపురం, హరిజన వీధి వద్ద సైదల్ అనే వ్యక్తి ఒడిశా నుండి కొంత మంది కళాకారులను తీసుకొచ్చి ఇక్కడ గత రెండు నెలల నుండి వినాయకుని రూపాలు తయారు చేయిస్తున్నారు. పారిశ్రామిక ప్రాంతంలోనే కాకుండా నగరంలోనే ఎవరూ చేయని విధంగా బంక మట్టి, గడ్డి, వెదురు, కలపతో వినాయకుని విగ్రహాలు తయారు చేయడంలో సైదులు ప్రసిద్ధిగాంచారు. దీంతో పారిశ్రామిక ప్రాంతం నలుమూలల నుండి సుమారు 20 మందికి పైగా మండపాలకు చెందిన యువకులు నచ్చిన బొమ్మలు తయారు చేసేందుకు సైదులు వద్ద ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే దీనికి ఆయన అంతా సిద్ధం చేసుకున్న తరుణంలో తుపాన్ కారణంగా కురిసిన వర్షాలకు కొన్ని బొమ్మలు దెబ్బ తిన్నాయి. ప్రస్తుతం తన వద్ద కేవలం 9 ఆర్డర్లకే పని జరుగుతుందని అతనంటున్నాడు.

పెద్ద ఎత్తున గణపతి పూజలు..

అలాగే పారిశ్రామిక ప్రాంతంలోని పలు చోట్ల యువకులు గణపతి పూజల కోసం పెద్ద సంఖ్యలో పందిళ్లు వేసి పూజలకు అన్నీ సిద్ధం చేస్తున్నారు. అందమైన గణనాథులు, అందర్నీ ఆకట్టుకునే పందిళ్లు, విద్యుద్దీపాల వెలుగులతో గణపతి పూజలు అట్టహాసంగా నిర్వహించేందుకు ఈ ప్రాంత యువత ఒకరితో ఒకరు పోటీ పడుతున్నారు.

డాక్‌యార్డ్ ఉద్యోగుల సమస్యలపై ఎంపీకి వినతి



ఎంపీ శ్రీభరత్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఈఎన్‌సీ ఎంప్లాయిస్ నేతలు

సింధియా : తూర్పు నావికాదళం పరిధిలో ఉన్న డాక్‌యార్డ్ ఉద్యోగుల సమస్యలపై విశాఖ ఎంపీ శ్రీభరత్‌కు ఈ.ఎన్.సి. ఎంప్లాయిస్ నేతలు సబ్బం కిరణ్‌కుమార్, మన్యాల ప్రసాద్‌బాబు, పాత్రపల్లి ప్రసాద్ లాసెన్స్ బే కాలనీలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. డాక్‌యార్డ్ ఉద్యోగులకు ప్రధాన మార్గంగా ఉన్న సర్దార్ వల్లభాయ్‌పటేల్ వంతెన మూతపడడంతో ఉద్యోగులు భారీ లారీల మధ్య ప్రాణం అరచేతిలో పెట్టుకుని సుమారు 15 కిలోమీటర్లు అదనంగా ప్రయాణం చేయాల్సి వస్తుందని తెలిపారు. బొగ్గు, సల్ఫర్, యూరియా వంటి రసాయన పదార్థాలు రోడ్లపై పడడం మూలంగా ద్విచక్ర వాహనాలు జారి ప్రమాదాలకు గురవుతున్నా యాజమాన్యం పట్టించుకోవడంలేదని తెలిపారు. ఎస్.బి.సి. వంతెన మీదుగా రాకపోకలకు అనుమతించే విధంగా నేవీ ఉన్నతాధికారులతో మాట్లాడాలని కోరారు. పాత పెన్షన్ స్కీమ్ కోసం ట్రేడ్ యూనియన్‌లు ఉద్యమిస్తూనే ఉన్నారని, లోక్‌సభలో పాత పెన్షన్ స్కీమ్ కోసం ప్రస్తావించాలని కోరారు. దీనికి ఎంపీ శ్రీభరత్ సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు నేతలు తెలిపారు.

షిప్‌యార్డ్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి



ఎంపీ పురందేశ్వరికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సింధియా : హిందూస్తాన్ షిప్‌యార్డ్ ఎల్ అండ్ ఎం సిరీస్ కార్మికుల సమస్యలపై షిప్‌యార్డ్ బీఎంఎస్ నాయకులు గురవారం కేంద్ర మంత్రి, రాజమండ్రి పార్లమెంట్ సభ్యులు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎల్ అండ్ ఎం సిరీస్ కార్మికులు గత కొన్నేళ్లుగా పని చేస్తున్నా ఉద్యోగ భద్రత లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వారిని పర్మినెంట్ చేసే విధంగా రక్షణ శాఖ మంత్రితో మాట్లాడి సమస్య పరిష్కరించాలని కోరారు. స్పందించిన ఎంపీ షిప్‌యార్డ్ యాజమాన్య వైఖరి, డిఫెన్స్ మినిస్టర్‌కు, షిప్‌యార్డ్ యాజమాన్యం మధ్య జరిగిన చర్చల గురించి అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే కార్మికుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు బీఎంఎస్ నాయకులు తెలిపారు.

వర్షంతో అవస్థలు



శ్రీరామ్‌నగర్‌లో ఇంట్లోకి చేరిన మురుగు నీరు



పైపులో నిలిచిపోయిన వ్యర్థాలను తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

మల్కాపురం : అల్పపీడనం కారణంగా గురువారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి 58వ వార్డు శ్రీరామ్‌నగర్ వద్ద గల గెడ్డ పొంగింది. దీంతో గెడ్డకు ఆనుకుని ఉన్న నివాసాల్లోకి మురుగు నీరు చేరింది. నిజానికి శ్రీరామ్‌నగర్ వద్ద గల గెడ్డ కోరమాండల్ సంస్థ రక్షణ గోడ దిగువ నుండి సముద్రంలో కలుస్తుంది. అయితే కోరమాండల్ అధికారులు తమ రక్షణ గోడ దిగువన గల గెడ్డను కుదించటంతో (వెడల్పు తగ్గించటం) వర్షాలు పడినప్పుడు ఎగువ ప్రాంతం నుండి వచ్చే మురుగు, వర్షం నీరు శ్రీరామ్‌నగర్ గెడ్డ వద్దకు వస్తుంది. అయితే గెడ్డ విశాలంగా లేకపోవటంతో అది పొంగి ఈ ప్రాంతానికి సమీపాన గల నివాసాల్లోకి నీరు చేరుతోంది. ఈ సమస్య గత కొన్నేళ్ల నుండి ఉంది. దీనిపై జీవీఎంసీ కమిషనర్ పరిశీలించి కుదించి ఉన్న గెడ్డను విశాలంగా చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఎమ్మెల్యే కూడా సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చారు. అయినా నేటికీ ఆ హామీ అమలు కాలేదు. గెడ్డను ఆధునికీకరించేందుకు కోరమాండల్ సంస్థ ఒప్పుకోకపోవటంతో శ్రీరామ్‌నగర్ గెడ్డకు ఆనుకుని ఉన్న స్థానికులు బిక్కుబిక్కుమంటు గడపాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు ఈ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు



సాయి సంకీర్తనలు ఆలపిస్తున్న భక్తులు



పూజలందుకున్న సాయిబాబా

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం ఏపీఎస్ఈబీ కాలనీలోని షిర్డీసాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణ అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం పంచహారతులు ఇచ్చారు. సాయంత్రం సామూహిక సాయి సంకీర్తనలతో బాబా వారికి పూజలు చేశారు. బాబావారికి ఊరేగింపు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు విళ్ల సత్యనారాయణ రావు, కోశాధికారి సుబ్బారావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.